


పిచ్చివీరాజు

**కటిక చీకటి అమావాస్య ఆవేళ.**

**గాలి మరీ ఎక్కువవడం వల్ల తెగ ఊగిపోతున్నాయి చెట్లు. వర్షంగానీ వస్తదేమో అని ఆకాశం కేసి చూస్తే అదేంలేదనిపిస్తుంది.**

**రామచంద్రపురంలో ఉన్న అన్ని సినేమా హాళ్లలోనూ రెండో ఆట విడిచి పెట్టేసేరు. అటు మాచవరం సైడూ, చెల్లూరు వేపూ ఇటు మాడుఊళ్ళోకి వెళ్ళే పల్చని జనం, సైకిళ్ళు వెళ్ళిపోయాయి.**

**ఇంకాస్సేపయ్యేక లాకుల్లో చింతచెట్లకింద చప్పుడైంది.**



---

అంతసేపూ కాపుగాసిన ముగ్గురు బలమైన మనుషులు ఎండిపోయిన ఆకులు తొక్కుకుంటూ కాలవగట్టు మీద కొస్తున్నారు. ఆ ముగ్గురూ గొడ్డుమాంసం బాగా తిన్న బాపతులాగ బాగా కండలు తిరిగున్నారు. వాళ్ళు దొంగలు, బిక్కవోలు దగ్గరుండే నక్కలోళ్ళు. ఎవరన్నా పట్టుకుంటే దొరక్కండా ఉండటానికి ఒళ్ళంతా కుమ్ముటాముదం రాసేసుకున్నారు. బాగా తాగున్నారేమో ధైర్యం బాగా ఎక్కువయ్యి బలంగా భూదేవిని తన్నుతా పెద్ద పెద్ద అంగలేస్తా నడుస్తున్నారు ఊళ్ళోకి.

భూతవైద్యం చేసే గోపాళంగారి దొడ్డి వెనక కట్టిన కంది కంప దడిని లాగేసి గోపాలాన్ని అతని భార్య పుష్పావతక్కనీ తాళ్ళతో కట్టేసి నవారు మంచం మీద పడున్న వాయిలు చీర చింపి వాళ్లనోళ్ళలో కుక్కేసి చాగల్నాడులో భూతవైద్యం నేర్చుకుని గోపాళం సంపాయించిన సంపాదనంతా పాత ట్రంకుపెట్టిలో సర్దేసుకు బయల్దేరారు. అక్కడ్నుంచి మేడ చెల్లాయమ్మ ఇంట్లోకి దూరేరు ఆ ఇంట్లో వాళ్ళెవరూ లేవకండా సీలేరులో కాంట్రాక్టులు చేసి సంపాయించిన చెల్లాయమ్మమొగుడు కర్రి ఆదినారాయణరెడ్డి సొమ్మంతా మూట గట్టుకుని, వెనకటికెప్పుడో మా ఊరికి ప్రెసిడెంటు చేసిన పొట్టిసుబ్బిరెడ్డిగారింటి వేపెళ్ళి అక్కడ సామానంతా నొల్లేసుకుని, కొత్త సంతపేటలో కొచ్చి బ్రాకెట్టు ఆదిరెడ్డిగారి దొడ్లోకి దూకి అక్కడ్నించి పాక్కుంటా ఇంట్లోకెళ్ళి వాళ్ళింట్లో నగానట్రా ఇనప్పెట్టిలో దొరికిన నీలరంగు ముఖమల్లుగుడ్డలో చుట్టేసుకుని కాలవ దగ్గర కొచ్చేరు.

అటు రామచంద్రపురం నించి బలభద్రపురం వైపు వెళ్ళే క్వారీ లారీ ఏదైనా వస్తే దాంట్లోకి దూకేద్దాం అనుకుంటుండగా చిన్నసలుపుతో ఎవరో బాధపడ్తున్నట్టూ మూలుగు విన్పించింది.

వెనక్కి తిరిగిచూస్తే- ఆంజనేయస్వామి గుడి అరుగుమీద ముడిచిపెట్టుకుని పడుకుని ఉన్న పిచ్చివీర్రాజు. చేతుల్తో గుడ్డమూటని గుండెలకి అదిమి పెట్టుకు మరీ పడుకున్నాడు.

వాడి వాలకం చూసిన దొంగలకి వాడు గుండెలకి అంత ఇదిగా అదిమి పెట్టుకున్న ఆ మూటలో చాలా విలువైన వస్తువులే ఉండి ఉంటాయనిపించింది. దాంతో, ఆ ముగ్గురిలో లేత దొంగ ఒకడు వెళ్ళి అవలీలగా పిచ్చివీర్రాజు మూట లాగేసుకున్నాడు.

మెలుకువ వచ్చిన వీర్రాజు ఆ లేత దొంగ దగ్గరకెళ్ళి తన మూట లాక్కునే ప్రయత్నం చేసేడు. "ఏడిసేవు ఎదవతత్తు కొడకా" అనుకున్న లేతదొంగ ఓ తోపు తోసేసరికి వెళ్ళి గంగరాయి చెట్టు మొదట్లో పడ్డ వీర్రాజు పులిలా లేచి ఒక్క అంగలో ఆ లేత దొంగ మీద పడి పచ్చడికింద కొట్టేస్తుంటే అది చూసిన తక్కిన ఇద్దరు దొంగలూ "ఈడెవడో మన చేతులకి కూడా పని చెపుతున్నాడేంటి" అనుకుంటూ దూకేరు పిచ్చి వీర్రాజు మీదికి.

వాళ్ళ అంచనాలు తల్లకిందులయ్యినియ్యి.

వాళ్ళ ముగ్గుర్నీ పులుసులోకి ఎముక మిగలకండా చావ గొట్టేస్తున్నాడు వీర్రాజు.

ఈ అరుపులకీ కేకలకీ ఆంజనేయస్వామిగుళ్ళో సాధువులూ, కాకివీర్రాజు షెడ్లో కాపలా పడుకునే మనిషీ పరిగెట్టుకొచ్చారు వాళ్ళ దగ్గరకి.

పిచ్చి వీర్రాజుకీ ఆ ముగ్గురు దొంగలకీ మధ్య ముష్టియుద్ధం జరుగుతానే ఉంది.

ఈలోగా ఊళ్ళోంచి బయల్దేరిన గుంపు కాలవదగ్గర కొచ్చేసరికి వీర్రాజు చేతుల్లో చావుదెబ్బలు తిన్న ముగ్గురు దొంగలూ నేల మీద పడిపోయున్నారు. వీర్రాజు మాత్రం తన మూటని గుండెలకి హద్దుకుంటూ పామంచాల దగ్గరకెళ్ళి దెబ్బలకున్న రక్తం కడుక్కుంటున్నాడు.

* * *

ఆవేళ, మనలోకంలో లేనట్టు పరధ్యానంగా నడుస్తుంటాడు పిచ్చివీర్రాజు.

బాగా పెరిగిన గెడ్డం, జులపాలజుట్టూ, అట్టలు గట్టుకుపోయిన పంచతో కావిడి బద్దలాగుంటాడు వీర్రాజు. ఎవరిజోలికి వెళ్ళడు. వాడు నోరు విప్పడం చూళ్ళేదెవరూ?

ఆంజనేయస్వామిగుడి అరుగుమీద గానీ, గోపాలరావుగారి కాఫీ హొటలు ముందున్న గంగరాయి చెట్టుకిందగానీ పడుకుంటాడు రాత్రుళ్ళు. పొద్దుటే వాడి కొబ్బరిడొక్కులో గోపాలరావు పోసే టీ తాగి ఇంకా వెలుగురాకుండానే ఊళ్ళోకెళ్తాడు.

ముందు వెలగల వీరవెంకటకృష్ణారెడ్డిగారి మేడ ముందు వేపచెట్టు దగ్గర కాస్సేపు కూర్చుంటాడు. అక్కడ్నించి సత్తి సూర్యనారాయణరెడ్డి గారింటి ఆకుపచ్చ కటకటాల దగ్గరా, కర్రి వెంకటయ్యగారింటి గేటు దగ్గరా అట్నుంచి రాజేశ్వరస్వామి గుడి పక్కన రథం దగ్గర కాస్సేపు నిలబడి మళ్ళీ కాలవ దగ్గర కొచ్చేస్తాడు. అయితే ఆ పిచ్చి వీర్రాజు ఎక్కడికెళ్ళినా ఎలాంటి అవస్థలో ఉన్నా వాడి మూట మట్టుకి వాడి శరీరంలో భాగంలాగా గుండెల్ని అతుక్కునే ఉంటది.

వాడ్ని చూసిన ప్రతి ఒక్కళ్ళు "వాడంత అత్తారబతంగా చూసుకునే ఆ మూటలో ఏముందో ఏంటో" అనుకుంటానే ఉంటారు.

* * *

రాత్రంతా విపరీతంగా కురిసిన వర్షంలో బాగా తడిసిపోయేడు వీర్రాజు. ఆ మర్నాడు బండలు బద్దలయ్యేలా కాసింది ఎండ. రాత్రి వానకి తడిసి ఎండకి ఎండిన వీర్రాజుకి జ్వరమొచ్చింది ఒళ్ళంతా కాలిపోయేంత జ్వరం. అప్పుడప్పుడు స్పృహ తప్పుతుంది. ఆ టైములో అక్కడికొచ్చిన నాగేంద్రప్రసాదు మూట మీద చెయ్యేసేడు. అంతే నల్లటి ప్రెసాదు ముఖాన్ని గోళ్ళతో రక్కేసేడు వీర్రాజు.

పాటలుపాడే అబ్రహాం వీర్రాజు పరిస్థితి చూసి చిన్నం నాగయ్య గుర్రబ్బండిలో వాళ్ల పేటలోకి తీసుకెళ్ళిపోయాడు.

నాలుగురోజులయ్యాకా బ్రహ్మయ్యగారి వీధిలోంచి నడుచుకుంటా వెళ్తున్నాడు వీర్రాజు. మున్సబుగారి తూము దగ్గర నిలబడిఉన్న ఊళ్ళో పెద్దోళ్ళకొడుకులు దారి పక్కనే ఉన్న ఎర్రకంకర గుట్టలోంచి ఒక రాయి తీసి విసిరారు.

అది సరాసరెళ్ళి వీర్రాజు నెవరగంతకి తగలడంతో రక్తం వచ్చింది. అరచేత్తో రక్తం తుడుచుకున్న వీర్రాజు తల తిప్పికూడా చూళ్ళేదు వాళ్ళకేసి.

మోచెయ్యంత పొడుగున్న కర్రని గిరగిరా తిప్పి విసిరేసరికి మెలికలు తిరుక్కుంటూ వెళ్ళిన ఆ కర్ర నడుస్తున్న వీర్రాజు కాళ్లకి అడ్డం

పడ్డంతో బోర్లాపడిపోయేడు. వాడి మోచేతులూ ముఖం కొట్టుకుపోయినియ్యి. కారుతున్న రక్తానికి ఎర్రకంకర దుమ్ము అంటుకుపోయింది. అయినా వాళ్ళనేం అన్లేదు.

దగ్గరకొచ్చిన ఒక కుర్రోడు మూటలాక్కునే ప్రయత్నంలో చెయ్యేసేసరికి, ఒంచిన కావిడి బద్దలా లేచిన వీర్రాజు ఆ కుర్రోడ్నే గాకండా ఇంతసేపూ ఏడిపించిన మొత్తం గుంపుని పచ్చడికింద కొట్టేసేడు.

ఊళ్ళోకి కొత్తగా దిగిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు ప్రకాశరావుగారు గుమస్తా గవర్రెడ్డిగార్ని అడిగేడు "ఆ పిచ్చోడి మూటలో ఏముంది రెడ్డిగారూ?" అని.

"తెలీదండి" అన్నాడు రెడ్డిగారు. "అసలతను పిచ్చోడెలాగయ్యేడు?" మళ్ళీ అడిగేడు ప్రకాశరావు.

"అదీ తెలీదండి" అన్నాడు గవర్రెడ్డి.

"మీరు ఈ ఊరివారే కదా ఆ వీర్రాజు పిచ్చివాడు కాకముందు అతని గురించేవన్నా తెల్సా మీకు?" అని ప్రకాశరావుగారు వేసిన ప్రశ్నకి కాస్సేపు కళ్ళు మూసుకుని గుర్తు చేసుకున్న గవర్రెడ్డి. "ఇతను మాలపేటలో కమ్యూనిస్టు పాటలు పాడే అబ్రహాంకి దగ్గర బంధువండి చదువూ సంధ్యా ఏం లేవు సత్తి సూర్నారాయణరెడ్డిగారి దగ్గర కొన్నాళ్ళు, కర్రి వెంకయ్యగారి కమతంలో కొన్నాళ్ళు ఉన్నాడు. ఈడు చాలా ఏళ్ళు పని చేసింది మట్టుకి పాత సంతపేటలో పెద్ద అద్దాలమేడ ఉంది చూసేరా ఆరింట్లో" అన్నాడు.

"ఎవరిది ఆ మేడ?"

"వెలగల వీరవెంకటకృష్ణారెడ్డిగారిది" అని మళ్ళిడి గవర్రెడ్డిగారు చెప్పడంతో ఆలోచిస్తా ఉండిపోయేడు ఆ వూరికి కొత్తగా వచ్చిన ప్రకాశరావుగారు.

పిచ్చివీర్రాజు మూట మీద చాలా కథలు జరిగినియ్యి. దాంతో చుట్టు పక్కల ఊళ్ళలోకి కూడా పాకిపోయింది వీర్రాజు మూట విషయం. ఎక్కడ చూసినా వాడిమూట గురించే మాటాడుకోడం జరుగుతుంది.

సోమేశ్వరం నించొచ్చిన ఇద్దరు కుర్రోళ్ళు అబ్రహాం ఇంట్లో వీర్రాజునీ అతని మూటనీ చూసి మరీ వెళ్ళారు. రామచంద్రపురం వాసుదేవా ఫొటోస్టూడియో నాగభూషణంగారొచ్చి మా స్టూడియో ముందెడతాను అని వీర్రాజు ఫొటోలు తీసుకున్నాడు.

* * *

ఎండాకాలం ఉక్కగా వుంది.

గోదాట్లో నీళ్ళు ఎండిపోతున్నాయి.

కట్టేసిన కాలవలో మెరక తీస్తున్నారు.

ఏ ఏడూ లేనంత ఎక్కువగా ఉన్నాయి వడగాల్పులు.

ఆ రోజు మిట్టమధ్యాన్నం పేటలో బెన్నిబాబుగాడింటి పక్కనున్న ఏసుపాదంగారి చర్చిపాక అంటుకుంది. అంతే అక్కడ్నించి ఎంత మంది ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆరడం లేదు. మంటలు అలా పాక తర్వాత పాక అంటుకుంది. అబ్రహాం వాళ్ళ పాక అఱుగుమీద ఆదమరిచి నిద్రోతున్న వీర్రాజు సెగకి ఉలిక్కిపడి లేచి చూస్తే మంటలు. పరపరా శబ్దాలు చేస్తూ ఎండు తాటాకు మంటలు గేదెలూ గొర్రెలూ పందులూ మేకలూ ఎటెళ్ళాలో దిక్కు తోచక చావుకేకలేస్తూ కకావికలమైపోయి పిచ్చి పిచ్చిగా కల తిరుగుతున్నాయి. గగ్గోలు

పెడుతూ జనం. వీర్రాజు చుట్టూ ఉన్న పాకలన్నీ రగులుకుపోతున్నాయి. బయటికెళ్ళడానికి దారిలేదు. చీమ దూరే సందు లేదు.

ఎప్పుడూ తన గుండెల దగ్గరుండే ఆ మూటని మరింత గట్టిగా హద్దుకుంటా ఆ మంటల్లోంచి బయటికెళ్దామని దూరిన వాడల్లా మంటలు లోపలికెళ్ళిపోయాడు. వచ్చిన దారిని వెనక్కెళదామని తలతిప్పి చూస్తే మండుతున్న పాక పాకంతా కూలిపోయి దార్ని మూసేసింది.

మొండిగా తనకి తోచిన దారిలో ఆ మంటల్లోకి దూరిపోయిన వీర్రాజు జుట్టూ, ఒళ్ళు, ట్టుకున్న పంచె కాలిపోతున్నాయి. ఏమాత్రం లెక్క చెయ్యకండా చంటిపిల్లని కాపాడుకున్నట్టు తన మూటని కాపాడుకుంటా ఎలాగో బయటపడ్డ పిచ్చివీర్రాజు మొత్తం కాలిపోయాడు. వాడి రూపురేఖలు మొత్తం మారిపోయినియ్యి. అక్కడక్కడా ఉడికిపోయిన మాంసం కుష్ఠురోగం ఉన్న వాడికంటే అసహ్యంగా తయారయ్యేడు.

పొలికేకలు పెడతా అఱుస్తూ నేల మీద పడి దొర్లుతూ నరకం అనుభవించిన పిచ్చివీర్రాజు దీపాలవేళకి దొర్లడం పూర్తిగా ఆపేసేడు. వాడి ఊపిరి ఆగిపోయింది. పిచ్చివీర్రాజు చచ్చిపోయేడు.

ఊరు ప్రెసిడెంటు కర్రిమందారెడ్డిగారు మర్నాడు పొద్దుట జనాల్తో పాటెళ్ళి శవదహనం చేయించి వచ్చేక ఆ మూటని పంచాయితీ ఆఫీసు అరుగుమీద పెట్టించారు.

ఆ మూటలో ఏముందో అన్న కుతూహలంతో జనంలో ఉన్న సత్తివీరెడ్డిగారూ, కర్రి రామారెడ్డిగారూ,చింతా అప్పారెడ్డిగారూ, బ్రాకెట్టు ఆదిరెడ్డిగారూ "మరి విప్పమందామా?" అన్నారు.

"అలాగే... కానీయండి" అని మందారెడ్డిగారు అనడంతో ఆ మూట ముందు కూర్చున్న చింతా పెద్దకాపుగారు గట్టిగా బిగించిన ముడిమీద చెయ్యేసారు.  చూస్తున్న జనం ముఖాల్లో ఆత్రుత.

చాలా గట్టిగా వేసిన మూడుముళ్లని చూసి "ఇవెక్కడి ముళ్ళురా బాబూ బ్రహ్మముళ్ళు" అనుకుంటూ విప్పేరు. ఆ గుడ్డల్లోపల ఇంకో గుడ్డవుంది. దానికీ మూడు ముళ్ళున్నాయి.

అంతా చూస్తున్నారు ఆత్రంగా.  ఆగుడ్డకున్న మూడుముళ్ళుకూడా విప్పేడు. లోపల ఇంకోగుడ్డ.

చూస్తున్న జనంలో ఆత్రుత ఎంత పెరిగిపోతుందో లోపలన్ని గుడ్డలున్నాయి.

ఇక ఆపుకోలేక కొందరయితే ముందుకు తోసుకొచ్చేస్తున్నారు.

ఒకోగుడ్డకీ మూడు ముళ్ళు చప్పున ఏడుగుడ్డలున్నాయి. ఆ ఏడోగుడ్డ లోపల ఒక ప్లాస్టిక్ సంచీ ఉంది. ఆ సంచిలో ఏముందా అని చూస్తున్నారు.  విప్పితే దాంట్లో పోస్టుకార్డు సైజు కాయితాల మడత ఉంది.

"అబ్బా తట్టుకోలేకపోతున్నానండి బాబూ. చెవటలు చూడండి" అనరిచేడు బిల్లు కలెక్టరుగారు.

"నీకు చెమటలు సరే తాడోళ్ళ చక్రాలకి చూడు ఏకంగా విరోచనమే అయిపోయింది" అన్నాడు తాడిసూరెడ్డిగారు.

అందరికీ కనపడేలాగ ఆ కాయితం మడతలు విప్పితే అందులోంచి కిందికి జారిందొక ఫొటో. ఆ ఫొటోలో ఉన్నదెవరంటే——

ఎప్పుడో భర్తతో పాటు వేరే దేశం వెళ్ళిపోయి మనదేశాన్నీ మా ఊర్నీ శాశ్వితంగా మర్చిపోయిన వెలగల వీర వెంకట క్రిష్ణారెడ్డిగారి అందాల కూతురు సూర్యావతి.

* * *